సాక్షి యాదాద్రి భువనగిరి

శుక్రవారం । 6 । జనవరి । 2023



ఇద్దరు బాలికల దిగ్బంధం

ఇద్దరు బాలికలను ఓ యువకుడు తన ఇంట్లో బంధించి భయభ్రాంతులకు గురి చేశాడు. - 8లో



పార్టీని బలోపేతం చేయాలి

సంస్థాగతంగా సీపీఎంను బలోపేతం చేయాలని పార్టీ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం అన్నారు. - 8లో

గరిష్టం/కనిష్టం 29.0°/15°

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. రాత్రిపూట చలి ఎక్కువగా ఉంటుంది.

న్యూస్‌రీల్

విధుల పట్ల అలసత్వం వహిస్తే చర్యలు



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న ప్రభుత్వ విప్ సునీత

బొమ్మలరామారం : ఉద్యోగులు విధుల పట్ల అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తప్పవని ప్రభుత్వ విప్ గొంగిడి సునీత హెచ్చరించారు. గురువారం బొమ్మలరామారం మండలంలోని చీకటిమామిడి గ్రామంలో గల మహాత్మా జ్యోతిబా పూలే బీసీ గురుకుల పాఠశాలను ఆమె పరిశీలించి మాట్లాడారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యాబోధనతోపాటు, మెనూ ప్రకారం భోజనం అందించాలన్నారు. పాఠశాల పరిసరాల్లో నెలకొన్న అపరిశుభ్రత పట్ల ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. తరగతి గదులతో పాటు పాఠశాల ప్రాంగణం పరిశుభ్రంగా ఉంచాలని పాఠశాల సిబ్బందికి సూచించారు. ఆమె వెంట ఎంపీపీ చిమ్ముల సుధీర్‌రెడ్డి, సర్పంచ్ మచ్చ వసంతాశ్రీనివాస్‌గౌడ్, వైస్ ఎంపీపీ శోభాచంద్రమౌళి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సత్యనారాయణ, పార్టీ మండల అధ్యక్షుడు పోలగాని వెంకటేష్‌గౌడ్ ఉన్నారు.

సావిత్రి బాయి పూలేను ఆదర్శంగా తీసుకోవాలి



ఉపాధ్యాయురాలిని సన్మానిస్తున్న కలెక్టర్ పమేలా సత్పతి, ఎమ్మెల్యే చిరుమర్తి

భువనగిరి : మహిళా ఉపాధ్యాయులు సావిత్రి బాయి పూలేను ఆదర్శంగా తీసుకోవాలని కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో గురువారం భువనగిరి పట్టణంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో సావిత్రిబాయి పూలే జయంతి పురస్కారాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్, ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్యతో కలిసి మహిళా ఉపాధ్యాయులకు సావిత్రి బాయి పూలే పురస్కారాలు అందించి ఘనంగా సత్కరించారు. ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు నారాయణ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో డీఈఓ నారాయణరెడ్డి, ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు భిక్షపతి, జిల్లా గౌరవ అధ్యక్షుడు బందారు రవివర్ధన్, వర్కింగ్ ప్రెసిడెంట్ బోయ రాములు, ప్రధాన కార్యదర్శి నాగటి వెంకటేష్, శ్రీనివాసులు, కనకయ్య, రమేష్, కృష్ణ, స్వామి, కిష్టయ్య, వెంకన్న, యాదయ్య, లచ్చిరాంనాయక్ పాల్గొన్నారు.

పల్లె ప్రకృతి వనం పనులు సకాలంలో చేపట్టాలి



మాసాన్‌పల్లిలో పల్లె ప్రకృతి వనం పరిశీలిస్తున్న జెడ్పీసీఈఓ కృష్ణారెడ్డి

గుండాల : పల్లె ప్రకృతి వనం పనులు సకాలంలో చేపట్టాలని జెడ్పీసీఈఓ సీహెచ్ కృష్ణారెడ్డి అధికారులను ఆదేశించారు. గురువారం మండలంలోని మాసాన్‌పల్లి గ్రామంలో పల్లె ప్రకృతి వనం, డంపింగ్ యార్డు, గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని సందర్శించారు. ఈసందర్భంగా రికార్డులను తనిఖీ పరిశీలించారు. గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో ప్రాథమిక పాఠశాలను తనిఖీ చేసి విద్యార్థులతో మాట్లాడారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. పల్లె ప్రకృతి వనాలకు బయో ఫెన్సింగ్ చేపట్టాలని సూచించారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయంలో 2020-21 వార్షిక నివేదికలు పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీనివాస్, సర్పంచ్ రాంరెడ్డి, ఎంపీఓ జనార్ధన్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి బాలలక్ష్మి, ఫీల్డ్ అసిస్టెంట్ పాలడుగు యాదయ్య తదితరులున్నారు.

మైనార్టీ రుణాల దరఖాస్తు గడువు పెంపు

భువనగిరిటౌన్ : మైనార్టీల ఫైనాన్స్ కార్పొరేషన్ రుణాల దరఖాస్తు గడువు తేదీని ప్రభుత్వం ఈ నెల 5 నుంచి 9వ తేదీ వరకు పొడిగించినట్లు జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ ఇన్‌చార్జ్ అధికారి యాదయ్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల వారు దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

అధికారులు మొద్దు నిద్ర వీడాలి

- భువనగిరి పట్టణంలోని రాంనగర్‌లో వెలిసిన ఫ్లెక్సీ

భువనగిరి : భువనగిరి పట్టణంలోని రాంనగర్ కాలనీలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ గురువారం నల్లగొండ రోడ్డు మార్గం పక్కన ఉన్న ఓ వాహనానికి గతంలో అధికారులకు అందజేసిన వినతి పత్రాలతో ముద్రించిన ఫ్లెక్సీని ఏర్పాటు చేశారు. మున్సిపల్ కార్యాలయానికి వెళ్లే మార్గంలో రాంనగర్ బాధితుల సంఘం పేరుతో ఈ ఫ్లెక్సీని పెట్టారు. మురుగు కాల్వలు, దోమలు, రోడ్డు సమస్యలను పరిష్కరించాలని గతంలో అనేకమార్లు మున్సిపల్ అధికారులకు ఎన్నిసార్లు వినతి పత్రాలు అందించినా.. ఎవరూ పట్టించుకోవడం లేదని, ఇప్పటికైనా సంబంధిత అధికారులు తమ మొద్దు నిద్ర వీడాలని అందులో పేర్కొన్నారు.



ఫ్లెక్సీ ఏర్పాటు చేసిన రాంనగర్ కాలనీ బాధితుల సంఘం

శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించాలి : డీఈఓ



మాట్లాడుతున్న డీఈఓ నారాయణరెడ్డి

సాక్షి,యాదాద్రి : విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం, శాస్త్రీయ ఆలోచనలు పెంపొందించేలా ఉపాధ్యాయులు బోధించాలని డీఈఓ నారాయణరెడ్డి, రాయల్ సొసైటీ ఆఫ్ కెమిస్ట్రీ మెంబర్, ప్రముఖ సైన్స్ సాహిత్య రచయిత్రి చాగంటి కృష్ణకుమారి అన్నారు. గురువారం కలెక్టరేట్‌లో మొదటి బ్యాచ్ ఉపాధ్యాయులకు చేపట్టిన పునశ్చరణ శిక్షణ ముగింపు కార్యక్రమంలో వారు మాట్లాడారు. విద్యార్థులకు పాఠాలు నేర్పించాలంటే ఉపాధ్యాయులే విద్యార్థులుగా మారి, సైన్స్ అంశాలు, భావనలు నేర్చుకోవాలన్నారు. శిక్షణలో భాగంగా కృత్యాధార బోధనా పద్ధతిలో కఠిన అంశాలను విద్యార్థులకు ఏ విధంగా అర్థమయ్యేలా బోధించాలో ఉపాధ్యాయులు నేర్చుకున్నారు. కార్యక్రమంలో రాయల్ సొసైటీ ఆఫ్ కెమిస్ట్రీ, బెంగుళూరు నుంచి జయ తీర్థారావ్, రిసోర్స్ పర్సన్ పద్మ, ప్రభు, పర్వావలి, కరీమా, సైక్టోరియల్ అధికారులు శ్రీనివాస్, జిల్లా సైన్స్ అధికారి భరణికుమార్, 200 మంది సైన్స్ ఉపాధ్యాయులు, జూనియర్ కళాశాలల అధ్యాపకులు పాల్గొన్నారు.

ఓటర్ల సంఖ్య.. 4,18,145

- పురుషులు 2,10,310, మహిళలు 2,07,825 మంది
- పెరిగిన ఓటర్ల సంఖ్య 1,105
- ఆలేరులో 933, భువనగిరిలో 172 ఓట్లు పెరిగాయి
- తుది ఓటరు జాబితా విడుదల



సాక్షి, యాదాద్రి : 2023 తుది ఓటరు జాబితాను ఎన్నికల కమిషన్ గురువారం విడుదల చేసింది. జిల్లాలో భువనగిరి, ఆలేరు అసెంబ్లీ రెండు సెగ్మెంట్లలో కలిపి మొత్తం 561 పోలింగ్ స్టేషన్లలో ఈ జాబితాలను ప్రదర్శించారు. ఈ సంవత్సరం 4,18,145 మంది ఓటర్లు నమోదయ్యారు. ఇందులో పురుషులు 2,10,310 మంది, మహిళలు 2,07,825 మంది, ఇతరులు 10 మంది ఉన్నారు. కాగా.. గత సంవత్సరం 4,17,040 మంది ఓటర్లు ఉండగా.. పురుషులు 2,09,418 మంది, మహిళలు 2,07,618 మంది, ఇతరులు నలుగురు ఉన్నారు. గత సంవత్సరంతో పోలిస్తే భువనగిరి, ఆలేరు నియోజకవర్గాల్లో కలిపి ఈసారి 1,105 మంది ఓటర్లు పెరిగారు.

తగ్గిన మహిళా ఓటర్లు

రెండు నియోజకవర్గాల్లో మహిళా ఓటర్ల సంఖ్య గణనీయంగా తగ్గింది. రెండు నియోజకవర్గాల్లో కలిపి పురుషుల కంటే మహిళా ఓటర్లు 2,485 మంది తగ్గారు. భువనగిరి నియోజకవర్గంలో పురుష ఓటర్ల కంటే మహిళా ఓటర్లు 734 మంది తక్కువగా నమోదయ్యారు. ఆలేరు నియోజకవర్గంలో పురుష ఓటర్ల కంటే 1751 మంది మహిళా ఓటర్లు తగ్గారు. గత సంవత్సరం ఓటర్ల జాబితాతో పోలిస్తే భువనగిరి నియోజకవర్గంలో 82 మంది పురుషులు, 89 మంది మహిళా ఓటర్లు పెరగగా, ఆలేరు నియోజకవర్గంలో 810 మంది పురుషులు, 118 మంది మహిళా ఓటర్లు పెరిగారు.

ముసాయిదా జాబితా కంటే..

నవంబర్ 1, 2022న ప్రకటించిన ఓటరు ముసాయిదా జాబితా కంటే రెండు నియోజకవర్గాల్లో కలిపి 967 మంది తగ్గారు. ఇందులో పురుషులు 327, మహిళలు 642 మంది ఓటర్లు ఉన్నారు. భువనగిరి నియోజకవర్గంలో ముసాయిదా కంటే 140 మంది పురుషులు, 290 మంది మహిళా ఓటర్లతో కలిపి మొత్తం 430 మంది తగ్గారు. ఆలేరు నియోజకవర్గంలో 187 మంది పురుషులు, 352 మంది మహిళలు కలిపి 537 మంది తగ్గారు. ఇతరులు ఇద్దరు పెరిగారు. మొత్తంగా రెండు నియోజకవర్గాల్లో ముసాయిదా కంటే మహిళా ఓటర్లు 642 మంది తగ్గారు. ఆలేరులో 1023 మంది ముసాయిదాలో ఉండగా, ఆలేరు పట్టణంలో 1026 మంది ఉన్నారు. ముసాయిదా జాబితాలో ఆలేరు నియోజకవర్గంలోని యాదగిరిగుట్టలో 1007 మంది, రాజాపేటలో 1023 మంది నమోదు కాగా తుది జాబితా లో మాత్రం రాజాపేటలో 997, యాదగిరిగుట్టలో 999 స్త్రీ పురుష నిష్పత్తి నమోదైంది. ఈ రెండు చోట్ల మహిళా ఓటర్లు తగ్గారు. ఆలేరులో మాత్రం ముసాయిదాలో 1017 మంది ఓటర్లు ఉండగా, తుది జాబితాలో 9 మంది పెరిగి 1026 నమోదయ్యారు. భువనగిరి నియోజకవర్గంలోని వలిగొండలో మహిళా ఓటర్లు తగ్గారు. అదేవిధంగా ఆలేరు నియోజవకర్గంలోని వలిగొండ మండలంలోని గ్రామాల్లో మహిళా ఓటర్లు తగ్గారు.

నియోజకవర్గాల వారీగా..

	భువనగిరి	ఆలేరు
పురుషులు	1,01,207	1,09,103
స్త్రీలు	1,00,473	1,07,352
ఇతరులు	01	09
మొత్తం	2,01,681	2,16,464

స్త్రీ, పురుష సగటు నిష్పత్తి 988

జిల్లాలో ఓటర్ల జాబితా ప్రకారం స్త్రీ, పురుష సగటు నిష్పత్తి 100 మంది పురుషులకు 988గా నమోదైంది. భువనగిరి నియోజకవర్గంలో సగటు 993 మంది కాగా, ఆలేరులో సగటు 984 మంది ఉన్నారు. భువనగిరి పట్టణంలో పురుషుల కంటే స్త్రీ ఓటర్ల సంఖ్య అదనంగా 23మంది ఉన్నారు.

భువనగిరి నియోజకవర్గంలో..

భువనగిరి నియోజకవర్గంలో 254 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. ఈ ఏడాది మొత్తం ఓటర్లు 2,01,681 ఉన్నారు. గత సంవత్సరం 2,01,509 మంది ఓటర్లు ఉండగా.. ఈసారి 172 మంది ఓటర్లు పెరిగారు. ఇందులో పురుషులు 1,01,207, మహిళలు 1,00,473 మంది, ఇతరులు ఒకరు ఉన్నారు.

ఆలేరు నియోజకవర్గంలో..

ఆలేరు నియోజకవర్గంలో 307 పోలింగ్ కేంద్రాలు ఉండగా, ఈ సంవత్సరం 2,16,464 మంది ఓటర్లు ఉన్నారు. గత సంవత్సరం 2,15,531 మంది ఓటర్లు ఉండగా.. ఈసారి 933 మంది ఓటర్లు పెరిగారు. ఇందులో పురుషులు 1,09103, 1,07352 మహిళలు, ఇతరులు 9 మంది ఉన్నారు.

ముసాయిదా తర్వాత

ఓటరు జాబితాను పరిశీలించి మార్పులు, చేర్పులు, కొత్త ఓటర్ల నమోదు తర్వాత పరిశీలన, అభ్యంతరాల నమోదు, సవరణలు, తొలగింపు దరఖాస్తులను డిసెంబర్ 15, 2020 వరకు స్వీకరించారు. ఓటరు నమోదు కోసం పోలింగ్ కేంద్రాల వారీగా బీఎల్‌ఓలతో ఓటరు నమోదు శిబిరాలను శని, ఆదివారాల్లో నిర్వహించారు. అన్ని దరఖాస్తులు, అభ్యంతరాల పరిష్కారం 2022 జనవరి 5 నాటికి పూర్తి చేసి తుది జాబితాను ప్రకటించారు. ఈ ముసాయిదా ప్రకా రం భువనగిరిలో 2,01,434 మంది ఉండగా 5280 మంది చేరికలు, 5033 మందిని తొలగించారు. ఆలేరు నియోజకవర్గంలో 2,16,642 ఉండగా, 5,050 చేరికలు, 5,228 మందిని తొలగించారు. కాగా.. జిల్లాలో కొత్త ఓటర్లు 5250 మంది నమోదయ్యారు. భువనగిరి నియోజకవర్గంలో 2,293 మంది, ఆలేరులో 2,957 మంది కొత్త ఓటర్లు ఓటరు జాబితాలో నమోదు చేసుకున్నారు.



భువనగిరికి ఓడీఎఫ్ ప్లస్‌ప్లస్



కేటీఆర్ చేతులమీదుగా ప్రశంసాపత్రాన్ని అందుకుంటున్న అదనపు కలెక్టర్, మున్సిపల్ కమిషనర్

- స్వచ్ఛ సర్వేక్షణ్ - 2022లో భాగంగా మున్సిపాలిటీకి ప్రత్యేక గుర్తింపు
- కేటీఆర్ చేతులమీదుగా ప్రశంసాపత్రం అందుకున్న అదనపు కలెక్టర్, మున్సిపల్ కమిషనర్

భువనగిరి : స్వచ్ఛ సర్వేక్షణ్- 2022లో భాగంగా భువనగిరి మున్సిపాలిటీకి ఓడీఎఫ్ (ప్లస్ ప్లస్) సర్టిఫికెట్ లభించింది. ఈమేరకు గురువారం హైదరాబాద్‌లోని మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో మంత్రి కేటీఆర్ చేతుల మీదుగా అదనపు కలెక్టర్ దీపక్ తివారీ, మున్సిపల్ కమిషనర్ నాగిరెడ్డిలు ప్రశంసాపత్రాన్ని అందుకున్నారు. గత సంవత్సరం మున్సిపాలిటీని ఓడీఎఫ్ పట్టణాల జాబితాలో చేర్చి మేలో కేంద్ర బృందం సర్వే నిర్వహించింది. ఇందులో భాగంగా ఓడీఎఫ్ ప్లస్ ప్లస్ పట్టణాల ఫలితాలను విడుదల చేసింది. రాష్ట్ర వ్యాప్తంగా 42 మున్సిపాలిటీలు ఓడీఎఫ్ ప్లస్ ప్లస్‌గా ఎంపిక అయ్యాయి. ఇందులో భువనగిరి మున్సిపాలిటీకి ఈ సర్టిఫికెట్ లభించింది. కాగా.. ఇప్పటికే 2021లోనూ మున్సిపాలిటీ ఓడీఎఫ్ ప్లస్‌ప్లస్ సర్టిఫికెట్ అందుకుంది.

మున్సిపాలిటీలో 12,527 నివాసాలు..

భువనగిరి మున్సిపాలిటీ పరిధిలో మొత్తం 35 వార్డులు ఉన్నాయి. ఆయా వార్డుల పరిధిలో సుమారు 65 వేలకు పైగా జనాభా ఉంది. మొత్తం 14,500 అసెస్‌మెంట్స్ ఉండగా ఇందులో 12,527 నివాస భవనాలు ఉన్నాయి. గత సంవత్సరం మేలో కేంద్రం బృందం మొత్తం 18 రకాల అంశాలను పరిగణలోకి తీసుకుని సర్వే చేసింది. బహిరంగ మలమూత్ర విసర్జన రహిత అంశాలపై వివరాలను ఎంపిక చేసుకున్న నివాసాల్లో అడిగి తెలుసుకున్నారు. ఈమేరకు పూర్తిగా బహిరంగ మలమూత్ర విసర్జన రహిత పట్టణంగా భువనగిరి మున్సిపాలిటీని గుర్తించడంతో పాటు, ప్రస్తుతం డంపింగ్ యార్డులో ఉన్న మలశుద్ధి కేంద్రం వల్ల రెండోసారి ఓడీఎఫ్ ప్లస్ ప్లస్‌గా ఎంపికైంది.

ఈ స్థాయి ఎప్పటికీ ఉండే విధంగా చర్యలు

మున్సిపాలిటీకి రెండుసార్లు ఓడీఎఫ్ సర్టిఫికెట్ రావడం సంతోషకరమైన విషయం. అధికారులు, సిబ్బంది కృషితో ఈ స్థాయి రెండోసారి దక్కింది. ఇదే స్థాయిని కొనసాగించేందుకు కృషి చేస్తాం. పట్టణ ప్రజలు సహకరించాలి.

– నాగిరెడ్డి, మున్సిపల్ కమిషనర్

ఆర్టీసీ ప్రైవేట్‌పరం ఆలోచనను ఉపసంహరించుకోవాలి

భువనగిరిటౌన్ : ఆర్టీసీని ప్రైవేటు పరం చేసే ఆలోచనను రాష్ట్ర ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు చెరుపల్లి సీతారాములు డిమాండ్ చేశారు. గురువారం సుందరయ్య భవనంలో నిర్వహించిన ఆ పార్టీ జిల్లా కమిటీ, మండల కార్యదర్శుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామాలకు బస్సు సౌకర్యం లేక ప్రజలు, విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి ఎండీ జహంగీర్, మండల కార్యదర్శులు పాల్గొన్నారు.

విద్యార్థులను ప్రతిభావంతులుగా తీర్చిదిద్దాలి

- కలెక్టర్ పమేలా సత్పతి

రామన్నపేట : ప్రభుత్వ కళాశాలలకు వచ్చే విద్యార్థులను ప్రతిభావంతులుగా తీర్చిదిద్దాలని కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. కమర్షియల్ గార్మెంట్ టెక్నాలజీ వృత్తి విద్యా కోర్సు విద్యార్థులు ఆన్‌జాబ్ ట్రైనింగ్ ప్రాక్టికల్స్ కమ్యూనిటీ ప్రోగ్రాంలో భాగంగా రకరకాల డిజైన్లతో కుట్టిన దుస్తులను స్థానిక అంగన్‌వాడీ చిన్నారులకు గురువారం రామన్నపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కలెక్టర్ చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులను చదువుతోపాటు ఆసక్తి కలిగిన రంగంలో రాణించే విధంగా ప్రోత్సహించాలని తెలిపారు. ఒకేషనల్ కోర్సు విద్యార్థులు ఒక సమూహంగా ఏర్పడి ప్రభుత్వంతోపాటు ఇతర సంస్థల నుంచి వచ్చే ప్రోత్సాహకాలు, అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించుకోవడం ద్వారా తాము ఎంచుకున్న లక్ష్యాలను సాధించవచ్చని తెలిపారు. రామన్నపేట ప్రభుత్వ కళాశాలను గోల్డెన్ జూనియర్ కళాశాలగా అభివర్ణించారు. సీజీటీ విద్యార్థుల ప్రతిభను అభినందించారు. కార్యక్రమంలో ఇంటర్మీడియట్ జిల్లా నోడల్ అధికారిణి రమణి, సీడీపీఓ శైలజ, తహసీల్దార్ ఆంజనేయులు, ప్రిన్సిపాల్ సంజీవ, అధ్యాపకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ పమేలా సత్పతి

ఎంజీయూ డైరీ ఆవిష్కరణ



డైరీ ఆవిష్కరిస్తున్న వీసీ గోపాల్‌రెడ్డి

నల్లగొండ రూరల్: మహాత్మాగాంధీ యూనివర్సిటీ ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సరం 2023 డైరీని గురువారం యూనివర్సిటీలో వీసీ గోపాల్‌రెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డైరీలో యూనివర్సిటీ సమాచారం సమగ్రంగా ఉందని, ఇది విద్యార్థులు, సిబ్బందికి ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. ఈకార్యక్రమంలో ఆడిట్ సెల్ డైరెక్టర్ అంజిరెడ్డి, రవి, శ్రీదేవి, రమేష్, ప్రేమ్‌సాగర్, మద్దిలేటి, హరీష్‌కుమార్, రేఖ, అన్నపూర్ణ తదితరులు పాల్గొన్నారు.

వెన్నముద్ద కృష్ణుడిగా..



యాదాద్రీశుడి అధ్యయనోత్సవాల్లో భాగంగా వెన్నముద్ద కృష్ణుడి అలంకరణలో నారసింహుడు

వడ్డీ వస్తలేదు!

- నాలుగేళ్లుగా స్త్రీనిధి రుణాల వడ్డీ జమచేయని ప్రభుత్వం
- రుణం తీసుకునేందుకు ఆసక్తి చూపని మహిళలు
- టార్గెట్ చేరుకోలేకపోతున్న అధికారులు

ఆత్మకూరు(ఎం) : స్త్రీనిధి క్రెడిట్ కోఆపరేటివ్ ఫెడరేషన్ లిమిటెడ్ ద్వారా గ్రామీణాభివృద్ధి సమభావన సంఘాలకు ప్రభుత్వం వడ్డీ లేని రుణాలు అందిస్తుంది. ఇందులో భాగంగా రూ. 25వేల నుంచి రూ. 3లక్షల వరకు రుణాలు ఇస్తుంది. స్త్రీనిధికి ప్రతి నెలా అసలుతో పాటు 11శాతం వడ్డీని సమభావన సంఘాలు చెల్లింస్తుంటాయి. ఈ వడ్డీని ప్రభుత్వం తిరిగి సంఘం ఖాతాలో జమ చేస్తుంటుంది. ఇలా వడ్డీ జమ కాగానే సంఘం గ్రూప్ లీడర్ల తీర్మానం మేరకు డ్రా చేసి రుణం తీసుకున్న సభ్యురాలికి అందజేస్తారు. అయితే గత నాలుగు సంవత్సరాల నుంచి జిల్లా వ్యాప్తంగా సమభావన సంఘాల మహిళలు చెల్లిస్తున్న వడ్డీ ప్రభుత్వం నుంచి తిరిగి రావడం లేదు. దీంతో మహిళలు ఇబ్బందులు పడుతున్నారు.

జిల్లా వ్యాప్తంగా ఇలా..

17 మండలాల్లో 2019- 20లో 5,835 సమ భావన సంఘాల నుంచి 20,315 మంది మహిళలు రూ. 91 కోట్లు అప్పుగానూ, 2020-21లో 5,761 సమభావన సంఘాల నుంచి 19,458 మంది మహిళలు రూ. 90కోట్ల అప్పు, 2021- 22లో 4,857 సమభావన సంఘాల నుంచి 15,660 మంది మహిళలు రూ. 99కోట్ల అప్పు, 2022- 23లో 2,660 సమభావన సంఘాల నుంచి 7,188 మంది మహిళలు రూ.48 కోట్లు అప్పుగా తీసుకున్నారు. 2019 నుంచి ఇప్పటి వరకు నాలుగు సంవత్సరాలుగా ప్రభుత్వం నుంచి వడ్డీ తిరిగి రావాల్సి ఉంది.

పూర్తికాని టార్గెట్

స్త్రీనిధి రుణాలపై ప్రభుత్వం వడ్డీ తిరిగి చెల్లించకపోవడంతో మహిళలు స్త్రీనిధి రుణాల పట్ల ఆసక్తి చూపడం లేదు. దీంతో ప్రభుత్వం విధించిన స్త్రీనిధి రుణాల టార్గెట్‌ను అధికారులు చేరుకోలేకపోతున్నారు. 2019- 20లో రూ.103కోట్ల రుణాలు ఇవ్వాల్సి ఉండగా రూ. 91కోట్లు, 2020- 21లో రూ.102కోట్ల రుణాలు ఇవ్వాల్సి ఉండగా రూ.90కోట్లు, 2021- 22లో రూ.106కోట్లు ఇవ్వాల్సి ఉండగా రూ.99కోట్లు, 2022- 23లో రూ.128కోట్ల రుణాలు ఇవ్వాల్సి ఉండగా ఇప్పటి వరకు రూ. 48కోట్ల రుణాలు మాత్రమే పంపిణీ చేశారు.

వడ్డీ వస్తలేదని తీసుకుంటలేను



నేను శ్రీలక్ష్మి సమభావన సంఘంలో సభ్యురాలిని. 35 సంవత్సరాల నుంచి కొనసాగుతున్నాను. పాడి పరిశ్రమ కోసం స్త్రీనిధి కింద రూ. 50వేలు తీసుకున్నాను. వడ్డీతో కలిపి రూ. 66వేల వరకు చెల్లించాను. మూడు సంవత్సరాలు అవుతుంది. ఇంత వరకు వడ్డీ వస్తలేదు. వడ్డీ వస్తలేదని మళ్లీ రుణం కూడా తీసుకుంట లేను.

– మేదబోయిన చంద్రమ్మ, తుక్కాపురం, ఆత్మకూరు(ఎం) మండలం

ప్రభుత్వం నుంచి రాగానే జమ చేస్తాం

మహిళల జీవనోపాధి కోసం జిల్లాలో స్త్రీనిధి రుణాలు అందజేస్తున్నాం. జిల్లా వ్యాప్తంగా స్త్రీనిధి రుణాలకు సంబంధించి వడ్డీలు గత నాలుగు సంవత్సరాలుగా రావాల్సి ఉంది. ప్రభుత్వం నుంచి రాగానే ఆయా సంఘాల ఖాతాల్లో జమ చేస్తాం.

– మందడి ఉపేందర్‌రెడ్డి, డీఆర్‌డీఓ

ఫెసిలిటేషన్ కౌన్సిల్ ఏర్పాటు

భువనగిరిటౌన్ : పరిశ్రమల మధ్య నెలకొన్న సమస్యలపై సత్వర పరిష్కారానికి, రాష్ట్ర ప్రభుత్వం జిల్లాలో ప్రాంతీయ సూక్ష్మ, చిన్న తరహా పరిశ్రమల ఫెసిలిటేషన్ కౌన్సిల్ (టీఎస్ఎంఎస్ఈఎఫ్‌సీ) ఏర్పాటు చేసినట్లు జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ శ్రీలక్ష్మి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కౌన్సిల్ కింద ఉమ్మడి జిల్లా, హైదరాబాద్ జిల్లాకు చెందిన సూక్ష్మ, చిన్న తరహా పరిశ్రమలు తమకు సంబంధించిన బకాయిలు చెల్లింపునకై అర్జీలు దాఖలు చేసుకోవచ్చునని, అర్జీ సక్రమమైనదైతే అది కేసుగా కౌన్సిల్‌లో విచారించడం జరుగుతుందని పేర్కొన్నారు. జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ ఈ కౌన్సిల్ కు చైర్మన్‌గా వ్యవహరిస్తారని తెలిపారు. ఈ కౌన్సిల్ ద్వారా పరిశ్రమలకు ఆలస్యమైన బకాయిల చెల్లింపుల కోసం కేసులు పరిశీలిస్తుందని, వడ్డీతో పాటు బకాయి మొత్తాన్ని కొనుగోలుదారు చెల్లించడానికి ఆదేశిస్తుందని పేర్కొన్నారు. పరిశ్రమల మధ్య చెల్లింపుకు సంబంధించిన వివాదాలకు పరిష్కరించేందుకు కౌన్సిల్ మధ్యవర్తిగా వ్యవహరిస్తుందని వివరించారు. పరిశ్రమలు, పారిశ్రామికవేత్తలు ఏదైనా సమస్య ఉన్నట్లయితే ప్రతి సోమవారం మధ్యాహ్నం 2 గంటల నుంచి 5 గంటల వరకు జనరల్ మేనేజర్‌కు తెలియజేయవచ్చని తెలిపారు.

క్లుప్తంగా

విద్యుదాఘాతంతో మహిళా రైతు మృతి


ఘటనా స్థలిలో స్రవంతి మృతదేహం


బొబ్బలి స్రవంతి (ఫైల్)

మద్దిరాల: విద్యుదాఘాతంతో మహిళా రైతు మృతిచెందిన ఘటన మండలంలోని రెడ్డిగూడెంలో గురువారం చోటుచేసుకుంది. హెడ్ కానిస్టేబుల్ మల్లయ్య తెలిపిన వివరాల ప్రకారం.. తుంగతుర్తి మండలం కొత్తగూడెం గ్రామానికి చెందిన బొబ్బలి మహేష్ రెడ్డిగూడెం గ్రామంలో భూమి కౌలుకు తీసుకొని వ్యవసాయం చేస్తున్నాడు. గురువారం కూలీలతో వరి నాట్లు వేయిస్తున్నాడు. ఈ క్రమంలో మహేష్ భార్య స్రవంతి(28) పొలంగట్టుపై నడుచుకుంటూ నాటు వేసే కూలీల దగ్గరకు వెళ్తుండగా అప్పటికే తెగి ఉన్న కరెంట్ వైరుకు తగిలి విద్యుదాఘాతంతో అక్కడికక్కడే మృతిచెందింది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తుంగతుర్తి ఏరియా ఆస్పత్రికి తరలించినట్లు పోలీసులు తెలిపారు. మృతురాలికి ఒక కుమారుడు, ఇద్దరు కుమార్తెలు సంతానం.

రాజాపేట మండలంలో..

రాజాపేట: విద్యుత్ షాక్‌తో రైతు మృతిచెందిన ఘటన మండలంలోని లక్ష్మక్కపల్లి గ్రామంలో గురువారం చోటుచేసుకుంది. వివరాలు.. లక్ష్మక్కపల్లి గ్రామానికి చెందిన బూడిద రవి(40) తన వ్యవసాయ బావి వద్దకు ఉదయం వెళ్లాడు. పారతో పొలం గట్టుపై వరం తీస్తూ పక్కనే ఉన్న బోరు మోటారు స్టార్టర్‌కు ఉన్న వైరు సరి చేస్తుండగా విద్యుత్ షాక్‌కు గురై అక్కడికక్కడే మృతిచెందాడు. రాత్రి వరకు భర్త ఇంటికి రాకపోవడంతో రవి భార్య, కుటుంబ సభ్యులు వ్యవసాయ బావి వద్దకు వెళ్లి చూడా పొలంలో విగతజీవిగా కనిపించాడు. మృతుడికి ఇద్దరు కుమారులు ఉన్నారు.

పరిశ్రమ ఏర్పాటు చేయండి కానీ..

- సోడియం సంబంధిత ఉత్పత్తులు చేపట్టవద్దు
- ప్రజాభిప్రాయ సేకరణలో తేల్చిచెప్పిన వాడపల్లి, ఇర్కిగూడెం గ్రామస్తులు


సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ భాస్కర్‌రావు


ప్రజాభిప్రాయ సేకరణకు హాజరైన ఎమ్మెల్యే భాస్కర్‌రావు, స్థానిక ప్రజలు

మిర్యాలగూడ: దామరచర్ల మండలంలోని వాడపల్లి, ఇర్కిగూడెం గ్రామ శివారులో గతంలో 65మెగావాట్ల థర్మల్ విద్యుత్ ప్లాంట్ కోసం కేటాయించిన స్థలంలో ప్రస్తుతం రూ.720కోట్లతో చేపట్టిన ఫెర్రో అల్లాయ్ పరిశ్రమ నిర్మించేందుకు గాను గురువారం పరిశ్రమ ప్రాంగణంలో కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టారు. జిల్లా అదనపు కలెక్టర్ భాస్కర్‌రావు అధ్యక్షతన జరిగిన ఈ ప్రజాభిప్రాయ సేకరణకు స్థానికులు భారీ సంఖ్యలో హాజరయ్యారు. పరిశ్రమ ఏర్పాటుకు తాము సానుకూలమేనని, కానీ అందులో సోడియం సంబంధిత ఉత్పత్తులు చేపట్టవద్దని కోరారు. మండలంలో ఇప్పటికే డెక్కన్ క్రోమైట్ పరిశ్రమ వ్యర్థాలతో పాటు వివిధ పరిశ్రమల నుంచి వచ్చే కాలుష్యంతో సతమతమవుతున్నామని అన్నారు. అనంతరం మిర్యాలగూడ ఎమ్మెల్యే భాస్కర్‌రావు మాట్లాడుతూ.. పరిశ్రమలు స్థాపించే సమయంలో ఇచ్చిన అన్ని హామీలను కచ్చితంగా అమలు చేయాలని, స్థానిక యువతకు పర్మినెంట్ ఉద్యోగాలు కల్పించాలని కోరారు. ఈ పరిశ్రమ కారణంగా సమీప వ్యవసాయ భూములకు నష్టం వాటిల్లితే మార్కెట్ ధరకు రెండింతలు చెల్లించి కొనుగోలు చేయాలని, రైతులకు నష్టపరిహారం అందించాలన్నారు. 172 ఎకరాల్లో 130 మెగావాట్ల బొగ్గు ఆధారిత థర్మల్ విద్యుత్‌తో పాటు స్టీల్ పరిశ్రమను నిర్మిస్తామని, 500 మందికి శాశ్వత ఉద్యోగాలు, 450 మందికి కాంట్రాక్ట్ ఉద్యోగాలు, మరో వెయ్యి మందికి నిర్మాణ సమయంలో ఉపాధి కల్పిస్తామని ఫెర్రో అల్లాయ్ పరిశ్రమ యాజమాన్యం తెలిపింది. పరిశ్రమ ఏర్పాటైన తర్వాత మరో 10వేల మందికి పరోక్షంగా లబ్ధి చేకూరుతుందని వారు పేర్కొన్నారు.

సోడియం సంబంధిత ఉత్పత్తులకు ససేమిరా...

ఫెర్రో అల్లాయ్ పరిశ్రమలో సోడియం శాకరిన్‌తో పాటు దాని అనుబంధ ఉత్పత్తుల తయారీ ప్రతిపాదనను భవిష్యత్తులో తీసుకురావద్దని స్థానికులు డిమాండ్ చేశారు. పరిశ్రమలో వెలువడే వ్యర్థాలను సమీపంలో ఉన్న కృష్ణానదిలో కలవకుండా పటిష్ఠ చర్యలు తీసుకోవాలని కోరారు. దామరచర్లలో ఏర్పాటు చేస్తున్న పరిశ్రమలు నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నాయని సమీప గ్రామాల ప్రజలు ఆందోళన చేపట్టారు. పరిశ్రమ ఏర్పాటు సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో మొండిచేయి చూపుతున్నారన్నారు. ఇప్పటికే ఉన్న పరిశ్రమలతోనే అనేక ఇబ్బందులు ఎదురవుతున్నాయని, ఈ పరిశ్రమ వల్ల కూడా కాలుష్యం పెరిగే ప్రమాదం ఉందని పలువురు ఆరోపించారు. హానికర రసాయన వ్యర్థాల నుంచి తమకు రక్షణ కల్పించాలని పరిశ్రమ యాజమాన్యాన్ని కోరారు. కార్యక్రమంలో మిర్యాలగూడ ఆర్డీఓ చెన్నయ్య, డీఎస్పీ వెంకటేశ్వర్‌రావు, సీఐలు రాఘవేందర్, నిగిడాల సురేష్‌కుమార్, సత్యనారాయణ, డీసీసీ అధ్యక్షుడు శంకర్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

సంస్థాగతంగా పార్టీని బలోపేతం చేయాలి


- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం


మాట్లాడుతున్న తమ్మినేని వీరభద్రం, చిత్రంలో మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి

మిర్యాలగూడ అర్బన్: సంస్థాగతంగా సీపీఎంను బలోపేతం చేయాలని పార్టీ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి అన్నారు. గురువారం మిర్యాలగూడ పట్టణంలోని టీఎన్ఆర్ గార్డెన్స్‌లో నిర్వహించిన పార్టీ నియోజకవర్గ జనరల్‌బాడీ సమావేశానికి వారు ముఖ్యఅతిథులుగా హాజరై మాట్లాడారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు గడపగడపకు తిరుగుతూ ప్రజల సమస్యలు తెలుసుకుని వాటి పరిష్కారం కోసం ఉద్యమాలు చేపట్టి గ్రామశాఖలను బలోపేతం చేయాలన్నారు. బీజేపీ వేస్తున్న ఎత్తుగడలను గ్రామస్థాయిలో ప్రజలకు వివరించి వారిని చైతన్యపర్చాలన్నారు. రాష్ట్రంలో కమ్యూనిస్టులకు ఆదరణ పెరిగిందని, దీనిని అవకాశంగా ఉపయోగించుకుని భవిష్యత్తులో బలమైన ఉద్యమాలకు సిద్ధం కావాలని పార్టీ నాయకులు, కార్యకర్తలకు సూచించారు. ఫిబ్రవరిలో మిర్యాలగూడలో నిర్వహించనున్న గిరిజన సంఘం రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర నాయకుడు డబ్బికార్ మల్లేష్, జిల్లా కార్యదర్శి ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి, నాయకులు జగదీష్, రాంనాయక్, కూన్‌రెడ్డి నాగిరెడ్డి, వీరేపల్లి వెంకటేశ్వర్లు, మల్లు గౌతంరెడ్డి, రవినాయక్, శశిధర్‌రెడ్డి, మంగారెడ్డి, పరశురాములు రామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.

మంత్రి సహకారాన్ని స్ఫూర్తిగా తీసుకోవాలి

- తెలంగాణ ప్రజారోగ్య వైద్య సంచాలకుడు డాక్టర్ గడల శ్రీనివాస్‌రావు


మంత్రి జగదీశ్‌రెడ్డికి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుతున్న శ్రీనివాస్‌రావు

సూర్యాపేట: ఉమ్మడి నల్లగొండ జిల్లా వ్యాప్తంగా వైద్యరంగ అభివృద్ధికి మంత్రి జగదీశ్‌రెడ్డి అందిస్తున్న సహకారాన్ని వైద్య సిబ్బంది స్ఫూర్తిగా తీసుకొని ప్రజలకు నాణ్యమైన వైద్యం అందించాలని తెలంగాణ ప్రజారోగ్య వైద్య సంచాలకుడు డాక్టర్ గడల శ్రీనివాస్‌రావు అన్నారు. గురువారం హైదరాబాద్‌లో మంత్రి జగదీశ్‌రెడ్డిని ఆయన మర్యాదపూర్వకంగా కలసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సూర్యాపేట జిల్లా కేంద్రంలో మంత్రి మెడికల్ కళాశాలను ఏర్పాటు చేయడమే కాకుండా ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో పేదలకు నాణ్యమైన వైద్యం అందించేలా కృషి చేస్తున్నారని అన్నారు. పీహెచ్‌సీలలో వైద్య ఉపకరణాలు, సిబ్బందికి కావాల్సిన సదుపాయాలు ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఆయన వెంట తెలంగాణ ప్రజారోగ్య వైద్య ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మండన్ సుదర్శన్, యూనియన్ నాయకులు తదితరులు ఉన్నారు.

బాలకార్మిక వ్యవస్థ నిర్మూలన అందరి బాధ్యత


మాట్లాడుతున్న సూర్యాపేట ఎస్పీ రాజేంద్రప్రసాద్

సూర్యాపేట క్రైం: జిల్లాలో బాలకార్మిక వ్యవస్థ నిర్మూలన అందరి బాధ్యత అని సూర్యాపేట ఎస్పీ రాజేంద్రప్రసాద్ గుర్తు చేశారు. ఈనెలలో చేపట్టనున్న తొమ్మిదో విడత ఆపరేషన్ స్మైల్ కార్యక్రమంపై గురువారం జిల్లా కేంద్రంలోని ఎస్పీ కార్యాలయంలో అధికారులతో నిర్వహించిన సమన్వయ సమావేశంలో ఆయన మాట్లాడారు. బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన, మానవ అక్రమ రవాణా నిరోధం, తప్పిపోయిన బాలల గుర్తింపు, నిరాదరణకు గురైన పిల్లల సంరక్షణ లక్ష్యంగా కేంద్ర , రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం జనవరిలో ఆపరేషన్ స్మైల్, జూలైలో ఆపరేషన్ ముస్కాన్ కార్యక్రమాలను నిర్వహిస్తున్నాయన్నారు. ఇందులో భాగంగా నిరాదరణకు గురై తప్పిపోయిన, వెట్టిచాకిరీలో మగ్గుతున్న బాలలను రాష్ట్ర మహిళా చైల్డ్ వెల్ఫేర్ పోలీస్ భద్రత విభాగం ఆధ్వర్యంలో చేపట్టే ఆపరేషన్ స్మైల్, ఆపరేషన్ ముస్కాన్ కార్యక్రమాల ద్వారా సంరక్షిస్తున్నట్లు తెలిపారు. గత సంవత్సరంలో 270 మంది బాలలను గుర్తించి సంరక్షణ కేంద్రాలకు తరలించామన్నారు. సమావేశంలో సీడబ్ల్యూసీ చైర్మన్ రామనరావు, డీఎస్పీ నాగభూషణం, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, చైల్డ్ వెల్ఫేర్ అధికారులు రవి కుమార్, నాగరాజు, నాగుల్‌మీర, కార్మిక శాఖ అధికారులు పాల్గొన్నారు.

విజిలెన్స్ అధికారినంటూ బెదిరింపులు..

- మూడేళ్ల జైలు శిక్ష

మిర్యాలగూడ: విజిలెన్స్ అధికారినంటూ ఎరువుల దుకాణం యజమానిని బెదిరించిన వ్యక్తికి మిర్యాలగూడ రెండవ అదనపు ప్రథమ శ్రేణి న్యాయమూర్తి వి. మాధవి మూడేళ్ల జైలు శిక్షతో పాటు రూ.5వేల జరిమానా విధిస్తూ గురువారం తీర్పు వెలువరించారు. వివరాలు.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కృష్ణా జిల్లా కంకిపాడు మండలం రావులూరు గ్రామానికి చెందిన ఐతం రవిశంకర్ 2019లో దామరచర్ల మండలంలోని కొండ్రపోల్ గ్రామం వద్ద గల రైతుమిత్ర ఎరువుల దుకాణంలోకి వెళ్లి విజిలెన్స్ అధికారినంటూ యజమాని కటికం కృష్ణారెడ్డిని బెదిరించి అతడి వద్ద నుంచి రూ.60వేల నగదు, ఒక బంగారు, రెండు వెండి ఉంగరాలను తీసుకెళ్లాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు అప్పటి వాడపల్లి ఎస్ఐ కె. నర్సింహారావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. కేసు విచారణలో భాగంగా నిందితుడు రవిశంకర్‌పై నేరం రుజువు కావడంతో గురువారం మిర్యాలగూడ రెండవ అదనపు ప్రథమ శ్రేణి న్యాయమూర్తి వి. మాధవి సాక్ష్యాధారాలు పరిశీలించి మూడేళ్ల జైలు శిక్షతో పాటు రూ.5వేల జరిమానా విధించారు. ఈ కేసును పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఎస్. దీపారాణి వాదించగా, ఆమెకు కోర్టు కానిస్టేబుల్ జాని సహకరించారు.

ఆలిండియా ఇంటర్ యూనివర్సిటీ క్రీడలకు ఎంపిక

నడిగూడెం: మండల కేంద్రానికి చెందిన కేశబోయిన మురళీకృష్ణ ఆలిండియా ఇంటర్ యూనివర్సిటీ క్రీడలకు ఎంపికయ్యాడు. తమిళనాడు ఫిజికల్ ఎడ్యుకేషన్ స్పోర్ట్స్ యూనివర్సిటీ ఆధ్వర్యంలో 2022–23 సౌత్ వెస్ట్ జోన్ ఇంటర్ యూనివర్సిటీ తరఫున షాట్‌పుట్ క్రీడకు ఎంపికైనట్లు గురువారం ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నాడు. పొట్టి శ్రీరాములు తెలుగు యూనివర్సిటీలో పీజీ చదువుతున్న మురళీకృష్ణను యూనివర్సిటీ వైస్ చాన్సలర్ తంగడ కిషన్‌రావు అభినందించారు.

రజకుల రెగ్యులరైజ్‌కు కృషిచేస్తా


క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ బసవరాజు సారయ్య

యాదగిరిగుట్ట: యాదాద్రి లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ఆనవాయితీగా సేవలు మోసే రజకుల రెగ్యులరైజ్‌కు కృషిచేస్తానని ఎమ్మెల్సీ బసవరాజు సారయ్య అన్నారు. గురువారం ఆయన యాదాద్రీశుడిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆచార్యులు ఆయనకు వేద ఆశీర్వచనం చేయగా, అధికారులు లడ్డూ ప్రసాదం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. యాదాద్రి దేవాలయంలో రజకులను రెగ్యులరైజ్ చేసే విషయాన్ని సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్తానన్నారు. యాదగిరిగుట్ట పట్టణంలో రజక భవనం నిర్మాణానికి తన వంతుగా సాయం అందిస్తానని పేర్కొన్నారు. అంతకుముందు రజక సంఘం నూతన సంవత్సరం క్యాలెండర్‌ను వైకుంఠద్వారం వద్ద ఆయన ఆవిష్కరించారు. ఆయన వెంట మాజీ ఎంపీటీసీ నాగపూరి నర్సింహ, మాజీ సర్పంచ్ నమిలే పాండు, రాయగిరి రాజు, జూపల్లి నగేష్, పాండురాజు ఉప్పలయ్య, బొజ్జ శ్రీను, గడసంతల మల్లేష్ తదితరులున్నారు.

వేధింపులకు గురిచేస్తున్నాడని దాడి

- ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితుడు

నల్లగొండ క్రైం: తన అన్న కుమార్తెను వేధింపులకు గురిచేస్తున్న వ్యక్తిపై కత్తితో దాడి చేశాడు ఓ ఆటో డ్రైవర్. ఈ సంఘటన గురువారం నల్లగొండ పట్టణంలోని ప్రకాశం బజార్‌లో చోటు చేసుకుంది. వన్‌టౌన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కనగల్‌కు చెందిన రాయల రామలింగం ఆటో డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. రామలింగం అన్న కుమార్తెను నల్లగొండ మండలంలోని తొరగల్ గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ నాగమల్ల రమేష్ వేధింపులకు గురిచేస్తున్నాడు. ఇది మనసులో పెట్టుకున్న రామలింగం గురువారం పట్టణంలోని ప్రకాశం బజారులో బైక్‌పై వెళ్తున్న రమేష్‌ను అడ్డగించి తన వెంట తెచ్చుకున్న కత్తితో దాడి చేశాడు. ఈ దాడిలో గాయపడిన రమేష్ పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ప్రస్తుతం అతడికి ప్రమాదం ఏమీలేదని వైద్యులు తెలిపారు. అయితే బాధితుడు, నిందితుడు ఇద్దరూ ఆటో డ్రైవర్లు కావడంతో పాటు వీరికి బంధుత్వం ఉందని, గతంలోనూ రామలింగం పలుమార్లు ఇదే విషయమై రమేష్‌ను పెద్దమనుషుల సమక్షంలో పద్ధతి మార్చుకోవాలని సర్ది చెప్పినట్లు పోలీసులు చెబుతున్నారు. బాధితుడు రమేష్ భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు వన్ టౌన్ సీఐ గోపి తెలిపారు.

వ్యక్తి అదృశ్యం.. కేసు నమోదు


కప్పల యాదయ్య

అడ్డగూడూరు: చిట్టీల వ్యాపారం చేసి అప్పుల పాలైన వ్యక్తి మానసిక ఒత్తిడికి లోనై ఇంటి నుంచి వెళ్లిపోయి తిరిగి రాలేదు. అతడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు గురువారం మిస్సింగ్ కేసు నమోదు చేసినట్లు అడ్డగూడూరు ఎస్ఐ ఉదయ్‌కిరణ్ తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని ధర్మారం గ్రామానికి చెందిన కప్పల యాదయ్య(50) వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగించేవాడు. యాదయ్య సంవత్సరం క్రితం గ్రామంలో చిట్టీల వ్యాపారం మొదలుపెట్టగా అందులో నష్టం వచ్చింది. దీంతో యాదయ్య తన కుటుంబ సభ్యులతో కలిసి చిన్నపడిశాల గ్రామానికి వలస వెళ్లి తమ బంధువు అయిన పూజారి భిక్షమయ్య వ్యవసాయ భూమిని కౌలుకి తీసుకుని సాగుచేస్తూ అక్కడే ఉంటున్నారు. ఈ క్రమంలో చిట్టీ డబ్బులు కట్టిన వారు తమ డబ్బులు చెల్లించాలని యాదయ్యపై ఒత్తిడి తీసుకురావడంతో మానసిక ఒత్తిడికి లోనైన అతడు ఈ నెల 2వ తేదీన ఇంట్లో ఎవరికీ చెప్పకుండా ఆటోలో తిరుమలగిరి మండల కేంద్రానికి వెళ్లి తిరిగి రాలేదు. యాదయ్య కుటుంబ సభ్యులు తమ బంధువుల ఇళ్లలో వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో గురువారం యాదయ్య భార్య పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

విద్యార్థి అదృశ్యం..


భాను

హుజూర్‌నగర్ (చింతలపాలెం): తల్లి మందలించిందని ఇంట్లో నుంచి వెళ్లిపోయిన విద్యార్థి తిరిగి ఇంటికి రాలేదు. ఎస్ఐ కృష్ణారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. చింతలపాలెం మండల పరిధిలోని దొండపాడు గ్రామానికి చెందిన తిరుమలగిరి లక్ష్మయ్య, యశోద దంపతుల కుమారుడు భాను స్థానిక పాఠశాలలో 10వ తరగతి చదువుతున్నాడు. అతడు పాఠశాలకు సరిగ్గా వెళ్లడం లేదని తల్లి మందలించగా ఈ నెల 3వ తేదీ రాత్రి ఇంటి నుంచి వెళ్లిపోయాడు. కుటుంబ సభ్యులు ఎంత వెతికినా భాను ఆచూకీ లభించకపోవడంతో గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. భాను వయస్సు 16ఏళ్లు ఉంటుందని, ఎత్తు 4.5 అడుగులు, చామనఛాయ రంగు, నలుపు రంగు ప్యాంట్, నీలం రంగు చొక్కా వేసుకున్నట్లు పేర్కొన్నారు.

వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరు మహిళలు మృతి

నార్కట్‌పల్లి: దైవదర్శనానికి వెళ్తూ రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన మహిళ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గురువారం మృతిచెందింది. వివరాలు.. నార్కట్‌పల్లికి చెందిన కొప్పు లింగస్వామిగౌడ్, కొండ కృష్ణగౌడ్ స్నేహితులు. వీరు తమ కుటుంబ సభ్యులతో కలసి డిసెంబర్ 25న ధర్మపురి పుణ్యక్షేత్రానికి అద్దె కారులో బయల్దేరారు. మార్గమధ్యలో కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలం సుందరగిరి గ్రామం వద్ద వీరు ప్రయాణిస్తున్న కారు అదుపు తప్పి చెట్టుకు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కొప్పు సుజాత తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతూ అదే రోజు మృతిచెందగా, కొండ అనిత(37) హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గురువారం మృతిచెందింది.

మోతె మండల వాసి..


అనిత (ఫైల్)

మోతె: ద్విచక్ర వాహనం ఢీకొనడంతో తీవ్రగాయాలపాలై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మహిళ గురువారం మృతి చెందింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మోతె మండల పరిధిలో సిరికొండ గ్రామానికి చెందిన ఉప్పుల ఎల్లమ్మ మంగళవారం కూలీ పనికి వెళ్లి తిరిగి ఇంటికి వస్తుండగా గ్రామ శివారులో కాశీగూడెం వైపు వెళ్తున్న ఎస్‌కే నన్నెసాబ్ బైక్‌ను అజాగ్రత్తగా నడుకుంటూ వచ్చి ఎదురుగా ఎల్లమ్మను ఢీకొట్టాడు. దీంతో తీవ్ర గాయాలపాలైన ఎల్లమ్మను కుటుంబ సభ్యులు మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌కు తరలించగా, చికిత్స పొందుతూ గురువారం మృతిచెందింది. మృతురాలి కుమారుడు ఉప్పుల వెంకన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నాగభూషణం తెలిపారు.

సాక్షి క్లాసిఫైడ్స్


Services

ఆయుర్వేదం

■ బొల్లి, తెల్లమచ్చలు, సోరియాసిస్‌లకు ఎటువంటి పత్యం లేని చికిత్స కలదు. మందులు ఉచితముగా ఇవ్వబడును. సంప్ర: 9603055647, 7995392747 [G-888]

BUSINESS OFFER

■ ట్రాక్ ఆన్ కొరియర్స్ ప్రైవేట్ లిమిటెడ్ తెలంగాణ & ఆంధ్ర ఏరియాల్లో ఫ్రాంచైజీలు ఇవ్వబడును. Ph: 8977627877 / 8801459149 / 8448185066, ravi.kg@trackon.in [H-786775]


Wanted

■ TATA SKY మిర్యాలగూడలో పనిచేయుటకు Sales Promoters & Office Boys కావలెను. సంప్ర॥ 9676929505 [Y-772724]

■ లేపాక్షి హెల్త్ కేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకోనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఫ్రీవసతి + భోజనం. జీతం: 16k, ఏజెంట్ కమీషన్ 3k. ఫోన్: 9640300074. [HA-844]

■ స్టార్ హోంకేర్ HYD లో వృద్ధులకు పేషేంట్లకు సేవచేయుటకు, బేబి కేర్, ఇంటి పనికి స్త్రీ/పు కావలెను. జీతం: 16-30K, ఫ్రీ వసతి + భోజనం. ఫోన్: 7306230594, 9182365449. [HA-776696]

■ ప్రముఖ సంస్థ నందు మీ ఇంటి దగ్గర ఉంటూ పార్ట్‌టైం/ఫుల్‌టైం పోస్టల్ కవర్లపై అడ్రస్‌లు వ్రాయుటకు స్త్రీ/పురుషులు కావలెను. నెలకు 10-15వేలు వరకు సంపాదన. ఫ్రీ బుక్‌లెట్ కొరకు 9059509586 [G-776250]

■ "విజ" కంపెనీ నందు P/T, F/T, M/F కావలెను. Q : ఇంటర్, డిగ్రీ, B.Tech, MBA, గృహిణులు, రిటైర్డ్ ఎంప్లాయిస్ ఏజ్ : 19+ P/T 8వేలు, F/T 25వేలు సంపాదించే అవకాశం ✆ 62814 66281 [B-1645]

ప్రకటన కొరంత! స్పందన కొండంత!!
సాక్షి క్లాసిఫైడ్స్
ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకు
నాలుగు లైన్లకు రూ.:220/- (Black & White)
అదనపు లైనుకు రూ.: 50/- మాత్రమే
5% GST అదనం
నల్లగొండ: 9912220737, 9010080143, 9010002038
మిర్యాలగూడ: 9666021744
ఆలేరు: 9010178203
సూర్యాపేట: 9912220740, 9010422240, 9010038110
కోదాడ: 9010046033
భువనగిరి: 9010073592

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలను చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతి స్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి బ్రెయిన్ డెడ్

- అవయవదానం చేసిన కుటుంబ సభ్యులు


ఉపేందర్ పంతులు (ఫైల్)

తుర్కపల్లి: రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి ఆస్పత్రిలో చికిత్సపొందుతుండగా బ్రెయిన్ డెడ్ అయ్యింది. దీంతో కుటుంబ సభ్యులు అతడి అవయవాలను దానం చేసి మరో ఎనిమిది మందికి ప్రాణం పోశారు. వివరాలు.. మండలంలోని ఇబ్రహీంపూర్ గ్రామానికి చెందిన తిరుకోవల్లూరి ఉపేందర్ పంతులు(56) హైదరాబాద్‌లోని ఉప్పల్‌లో కుటుంబంతో కలిసి నివాసముంటున్నాడు. ఈ నెల 3వ తేదీన అతడు పని నిమిత్తం బైక్‌పై తుర్కపల్లి పోలీస్ స్టేషన్‌కు వచ్చి తిరిగి హైదరాబాద్‌కు వెళ్తుండగా మాదాపూర్ గ్రామంలోని వైన్స్ వద్ద ఉన్న మలుపు వద్ద ఎదురుగా వస్తున్న మరో బైక్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఉపేందర్ పంతులుకు తీవ్రగాయాలయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని ఉపేందర్ పంతులుని భువనగిరి ఏరియా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో కుటుంబ సభ్యులు సికింద్రాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తుండగా అతడి బ్రెయిన్ డెడ్ అయ్యింది. ఉపేందర్ పంతులు భార్య సరోజ, కొడుకు ప్రవీణ్ అనుమతితో గురువారం అతడి కళ్లు, కిడ్నీలు, లివర్, గుండెను జీవనదాన్ సంస్థకు స్వచ్ఛందంగా అందజేశారు. ఉపేందర్ పంతులు తన ప్రాణాలు వదులుతూ మరో 8మంది జీవితాల్లో వెలుగులు నింపుతున్నారని, ఆ కుటుంబాన్ని డాక్టర్ల బృందం అభినందించారు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రాఘవేందర్‌గౌడ్ తెలిపారు.

విద్యుత్ సవరణ బిల్లును కేంద్రం వెనక్కి తీసుకోవాలి

- రాజ్యసభ సభ్యుడు, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్. కృష్ణయ్య


విద్యుత్ బీసీ ఉద్యోగుల డైరీని ఆవిష్కరిస్తున్న ఆర్. కృష్ణయ్య, టీఎస్ఎస్‌పీడీసీఎల్ సీఎండీ రఘుమారెడ్డి తదితరులు

యాదగిరిగుట్ట: కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన విద్యుత్ సవరణ బిల్లును వెంటనే వెనక్కి తీసుకోవాలని రాజ్యసభ సభ్యుడు, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్. కృష్ణయ్య అన్నారు. గురువారం యాదగిరిగుట్టలో నిర్వహించిన తెలంగాణ విద్యుత్ బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం 17వ మహాసభలో ఆయన పాల్గొని డైరీ, క్యాలెండర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. విద్యుత్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఉద్యమిస్తామన్నారు. తెలంగాణ విద్యుత్ సంస్థల్లో పోస్టింగ్ విషయంలో బీసీ ఇంజనీర్లు, అధికారులకు అన్యాయం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రమోషన్లను సమీక్షించి, బీసీ ఉద్యోగులకు న్యాయం చేయాలన్నారు. 2009 నుంచి నేరుగా నియమించిన ఉద్యోగుల సీనియారిటీని మెరిట్ ప్రాతిపదికన ప్రకటించాలని పేర్కొన్నారు. టీఎస్ఎస్‌పీడీసీఎల్ సీఎండీ రఘుమారెడ్డి మాట్లాడుతూ.. వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ అందిస్తున్నామని వెల్లడించారు. విద్యుత్ సంస్థల్లో పనిచేస్తున్న ఉద్యోగులు వినియోగదారులకు మంచి సేవలు అందిస్తున్నారన్నారు. కార్యక్రమంలో బీసీ విద్యుత్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు కొడెపాక కుమారస్వామి, ముత్యం వెంకన్నగౌడ్, బ్రహ్మేందర్‌రావు, మారం శ్రీనివాస్, ఎస్. వెంకటేష్, పి. యాదగిరి, ఎం. అశోక్‌కుమార్, ఎం. విజయ్‌కుమార్, డాక్టర చంద్రుడు, కిషోర్ తదితరులున్నారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి

ఆలేరురూరల్: భువనగిరి ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బుధవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తి మృతిచెందాడు. ఆలేరు ఎస్ఐ ఇద్రీస్ అలీ తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని కొలనుపాక గ్రామంలో సుమారు 55సంవత్సరాలు పైబడిన వ్యక్తి భిక్షాటన చేస్తూ జీవనం సాగిస్తుండేవాడు. అతడు ఆహారం సరిగ్గా తీసుకోకపోవడంతో ఆరోగ్యం క్షీణించగా స్థానికులు బుధవారం ఉదయం ఆలేరు ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించారు. అక్కడ ప్రథమ చికిత్స అనంతరం సదరు వ్యక్తిని భువనగిరి ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ రాత్రి చనిపోయాడు. కొలనుపాక గ్రామస్తుడు న్యతకాని కార్తీక్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

గడ్డి మందు తాగి యువకుడి ఆత్మహత్య

నార్కట్‌పల్లి: గడ్డి మందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన యువకుడు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గురువారం మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని బి. వెల్లంల గ్రామపంచాయతీ పరిధిలోని కొత్తగూడెం గ్రామానికి చెందిన చిరుమర్తి స్వామి(25) కూలీ పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. గత ఆరు నెలల నుంచి అతడు మద్యానికి బానిసై ఎటువంటి పనిచేయకుండా ఉంటున్నాడు. ఈ క్రమంలో ఆరోగ్యం చెడిపోయి మానసికంగా కృంగిపోయిన స్వామి డిసెంబర్ 31న కోమటిరెడ్డి రామిరెడ్డి వ్యవసాయ బావి వద్దకు వెళ్లి గడ్డి మందు తాగి ఇంటికి వచ్చి ఇంట్లోని తన అన్నకు విషయం చెప్పాడు. దీంతో వెంటనే నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ గురువారం మృతిచెందాడు. మృతుడికి భార్య, ఒక కుమారుడు ఉన్నారు. మృతుడి తండ్రి శ్రీను ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రామకృష్ణ తెలిపారు.

ఇద్దరు బాలికలను బంధించిన యువకుడు


యువకుడి ఇంటి ముందు గుంపుగా నిలబడిన వారిని చెదరగొడుతున్న పోలీసులు


దగ్ధమైన బైక్

- ఆగ్రహంతో యువకుడి ఇంటిపై దాడి చేసిన బాలికల కుటుంబ సభ్యులు, గ్రామస్తులు
- ఇంటి ఆవరణలోని బైక్‌లకు నిప్పు
- పోలీసులపైకి రాళ్లు రువ్వడంతో వాహనం ధ్వంసం, సిబ్బందికి గాయాలు
- బీఎన్ తిమ్మాపురం గ్రామంలో ఉద్రిక్తత

భువనగిరి: ఇద్దరు బాలికలను ఓ యువకుడు తన ఇంట్లో బంధించి భయభ్రాంతులకు గురి చేశాడు. ఈ సంఘటన గురువారం యాదాద్రి జిల్లా భువనగిరి మండల పరిధిలోని బీఎన్ తిమ్మాపురం గ్రామంలో చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. బీఎన్ తిమ్మాపురం గ్రామానికి చెందిన మేడబోయిన యాకేష్ తల్లిదండ్రులు పని నిమిత్తం ఉదయం హైదరాబాద్‌కు వెళ్లారు. అదే గ్రామానికి చెందిన ఇద్దరు బాలికలు గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 9, 10వ తరగతి చదువుతున్నారు. పాఠశాలకు వెళ్లిన ఆ ఇద్దరు బాలికలు మధ్యాహ్నం తిరిగి ఇంటికి వస్తున్న సమయంలో వారికి మాయమాటలు చెప్పిన యాకేష్ తన ఇంటి ముందు నుంచి తాళం వేసి వెనుక వైపు నుంచి ఇంట్లోకి తీసుకెళ్లాడు. కాగా సాయంత్రం వరకు బాలికలు ఇంటికి తిరిగి రాకపోవడంతో తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు గ్రామంలో వెతికారు. మధ్యాహ్నం బాలికలు యాకేష్ ఇంటికి వెళ్లినట్లు తెలుసుకున్న కుటుంబ సభ్యులు తాళం వేసి ఉన్న ఇంటి వెనుకకు వెళ్లి చూడగా లోపలి నుంచి గడియ పెట్టి ఉండటం గుర్తించారు. దీంతో ఇంటి కిటికీ అద్దాలను ధ్వంసం చేయగా బాలికలు అందులో ఉండడం చూసి కోపోద్రిక్తులై ఇంటి ఆవరణలో ఉన్న రెండు బైక్‌లకు నిప్పు పెట్టారు. ఇది గమనించిన యాకేష్ ఇద్దరు బాలికలను బయటకు పంపి తాను లోపలే ఉన్నాడు. విషయం తెలుసుకున్న వెంటనే పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు.

గ్రామంలో ఉద్రిక్తత..

సంఘటనా స్థలానికి పోలీసులు చేరుకునే సమయానికి గ్రామస్తులు యాకేష్ ఇంటి ఎదుట పెద్దఎత్తున గూమిగూడారు. ఈ క్రమంలో యాకేష్‌పై గ్రామస్తులు దాడి చేసేందుకు యత్నించగా పోలీసులు లాఠీచార్జి చేసి అక్కడ ఉన్న వారిని చెదరగొట్టారు. యువకుడిని పోలీస్ స్టేషన్‌కు తరలించే క్రమంలో కొంతమంది రాళ్లు విసరడంతో పోలీసు వాహనం అద్దాలు పగిలాయి. ఒక పోలీస్‌కు స్వల్ప గాయాలయ్యాయి. ఇద్దరు విద్యార్థినులను పోలీస్ స్టేషన్‌కు తరలించి మహిళా పోలీసులతో విచారణ నిర్వహిస్తామని భువనగిరి రూరల్ సీఐ వెంకటేశం పేర్కొన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు యువకుడిపై పోక్సో కేసు నమోదు చేస్తామని రూరల్ ఎస్ఐ రాఘవేందర్‌గౌడ్ చెప్పారు. అగ్నిమాపక సిబ్బంది వచ్చి దగ్ధమవుతున్న బైక్‌లను ఆర్పేశారు.